క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

సాలూరు: పట్టణంలోని వడ్డివీధి, వేదసమాజం, మహంతివీధి, తదితర పోలింగ్‌స్టేషన్లను పట్టణ సీఐ వాసునాయుడు, ఎస్సై సీతారామ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో గల వసతులపై ఆరా తీశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్లను సందర్శిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్యేను అభినందించిన గ్రామస్తులు



ఎమ్మెల్యేను అభినందిస్తున్న గ్రామస్తులు

పార్వతీపురం టౌన్: ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎంతోమంది ప్రజాప్రతినిధులు వచ్చి వెళ్లారు. ఇలా ఎన్నో దశాబ్దాలు గడుస్తూనే ఉన్నాయి తప్ప ఆ గ్రామానికి మాత్రం రహదారి మోక్షం లభించక 50 ఏళ్లగా ఆశగా ఎదురు చూస్తున్న వారి కల నేరవేరింది. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో అంటిపేట మెయిన్ రోడ్డు నుంచి వెంకటాపురం గ్రామానికి బీటీ రహదారి పనులు చేపట్టిన కారణంగా ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జోగారావును వెంకటాపురం గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. గ్రామస్తులమంతా మీ వెంటే నడుస్తామని, మీకు రుణపడి ఉంటామని చెబుతూ తమ మనసులోని ఆనందాన్ని ఆయనతో పంచుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సిరికి మహేష్, దానబాబు, అప్పలనాయుడు, సిరికి శ్రీనివాసరావు, యువత, పెద్దలు కొట్యాడ మురళి, కొట్యాడ కృష్ణ, శివున్నాయుడు, తిరుపతిరావు, సత్యనారాయణ, శ్రావణ్, ఇతరసభ్యులతో పాటు గ్రామప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్తుల కల సాకారం



కొత్తగా నిర్మించిన చెల్లెంపేట బీటీ రోడ్డు

బలిజిపేట: మండలంలోని చెల్లెంపేట గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణంతో తమ కల సాకారమైందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామానికి రెండు వైపులా బీటీరోడ్డు నిర్మాణం జరగడం ఇదే ప్రథమమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాతే బీటీ రోడ్డు నిర్మాణం జరిగిందని తెలిపారు. మొత్తం రూ.2.30 కోట్లతో 3.2 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారని తెలిపారు. దీంతో ఏ అర్ధరాత్రి సమయంలో అయినా, వర్షాకాలంలో అయినా గ్రామానికి ధైర్యంగా వచ్చే అవకాశాలున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయి తప్ప నెరవేర్చడంలో విఫలమయ్యాయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే జోగారావు చొరవతో పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వానికి గ్రామస్తులంతా రుణపడి ఉంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా పారాయణం



గీతాపారాయణం చేస్తున్న రుత్వికులు, భక్తులు

పార్వతీపురం: మండలంలోని చినబొండపల్లి గ్రామంలో శ్రీజగన్మాత ఈశ్వరీ మహదేవీ పీఠంలో పలువురు భక్తులు భక్తి శ్రద్ధలతో ఆదివారం గీతా పారాయణం నిర్వహించారు. శ్రీ కృష్ణ విశ్వశాంతి గీతా మహాయజ్ఞంలో భాగంగా 40 రోజులపాటు గీతా పారాయణం చేయనున్నారు. పీఠాధిపతులు శ్రీనివాసస్వాములు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేసి ప్రతి శ్లోకానికి హోమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతా యజ్ఞం చేయడం వల్ల విశ్వశాంతి, సమాజ శాంతి కలుగుతాయన్నారు. కార్యక్రమంలో పలువురు ఋత్విక్కులు, భక్తులు పాల్గొన్నారు.

చుక్కలమందుకు చక్కని స్పందన



సీతానగరం: ఆంజనేయస్వామి ఆలయం వద్ద పోలియో చుక్కలు వేసిన రికార్డులను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి ఎం.మణి



పార్వతీపురం టౌన్: పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి ఎం.మణి

సీతానగరం: సమాజం నుంచి పోలియో మహమ్మారిని తరిమికొట్టడం అందరి సహకారంతోనే సాధ్యమని గుర్తించి జాతీయస్థాయిలో ఒకే రోజు పోలియో చుక్కల మందును చిన్నారులకు వేస్తున్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ మానిటరింగ్ అధికారి ఎం.మణి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పోలియో ఆదివారం కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలోని పెదంకలాం, సీతానగరం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బూత్‌లను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ పేరెంట్స్ తమ పిల్లలకు పోలియో చుక్కలు వేసి నిండు ప్రాణానికి భరోసా కల్పించాలని కోరారు. వ్యాధి నిరోధక మందులు క్రమం తప్పకుండా వేయాలని పిలుపునిచ్చారు. అలాగే పెదంకలాం పీహెచ్‌సీలో ఎంపీపీ బలగ రమణమ్మ, వైద్యాధికారి రాధాకాంత్, సీతానగరం పీహెచ్‌సీలో ఎంపీటీసీలు కుసుమ, ఎస్.గౌరి వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, వైద్యాధికారి బి.పావని, సీహెచ్‌ఓ ఎస్వీ రమణ, బక్కుపేటలో హెచ్‌ఎస్ శర్మ, అప్పయ్యపేటలో హెచ్‌వీ భవాని చిన్నారులకు చుక్కల మందు వేశారు. కార్యక్రమంలో 96 శాతం మంది చిన్నారుకు చుక్కలమందు వేసినట్లు డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి తెలియజేశారు.

బలిజిపేటలో డీఎంఓ పరిశీలన



మక్కువలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

బలిజిపేట: పల్స్‌పోలియో చుక్కలు వేసిన వారందరికీ ఎడమ చేతివేలి గోరుపై మార్కు చేయాలని జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అజ్జాడ, మురగడాం, పి.చాకరాపల్లి గ్రామాల్లో పల్స్‌పోలియో కేంద్రాలను ఆయన ఆదివారం పర్యవేక్షించారు. సాయంత్రం వరకు ఉండి నిర్ధారించిన కేంద్రాల వద్దకు వచ్చేవారికి చుక్కలు వేయాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. చిన్నారులను కేంద్రాల వద్దకు తీసుకువచ్చి చుక్కలు వేయించుకునే విధంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. చుక్కలు వేసిన వారి వివరాలు పట్టికలో రాసుకుని సాయంత్రం డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పంపించాలని కోరారు. పోలియో రహిత సమాజం నిర్మించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీల పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో 2,922మంది చిన్నారులు లక్ష్యం కాగా 2,775 మందికి, అరసాడ పీహెచ్‌సీ పరిధిలో 2,589 మంది లక్ష్యం కాగా 2,000మందికి, గలావల్లి పీహెచ్‌సీ పరిధిలో 945లక్ష్యం కాగా 875 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో బలిజిపేట సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారులు శశిధర్, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మక్కువ: కన్నంపేటలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ



బలిజిపేటలో చిన్నారికి చుక్కలు వేస్తున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, సర్పంచ్ రాఘులత, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం

పార్వతీపురంలో..

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులతో కలిసి ఆదివారం తన చేతుల మీదగా చిన్న పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారి శాశ్వత నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, ఐదేళ్లలోపు వయస్సు గల పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించేందుకు నేటి నుంచి మంగళవారం వరకు పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగనుందని కావున తల్లిదండ్రులందరూ వారి 5ఏళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించి పోలియో మహమ్మారికి దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మువ్వల సత్యం నాయుడు, ఏపీఎన్జీఓ అధ్యక్షుడు కిశోర్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కార్యక్రమం

పార్వతీపురంలోని 30వార్డుల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు నిర్వహించారు. తహసీల్దార్ కె.ఆనందరావు కార్యక్రమాలను పరిశీలించారు.



బలిజిపేట: పి.చాకరాపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ



సీతానగరం: పెదంకలాం పీహెచ్‌సీలో చుక్కల మందు వేస్తున్న ఎంపీపీ బి.రమణమ్మ



పార్వతీపురం టౌన్: రైల్వేస్టేషన్‌లో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న వైద్య సిబ్బంది

పల్స్‌పోలియో విజయవంతం

మక్కువ: మండలంలోని ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ప్రభుత్వ పాఠశాలలు, ముఖ్య కూడళ్లు, బస్టాప్‌ల వద్ద సిబ్బంది బూత్‌లు ఏర్పాటు చేసి చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో 2,922 మంది చిన్నారులకు గాను 2,808 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 2,530 మంది చిన్నారులకు గాను 2441 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు. వ్యాక్సిన్ బూత్‌లను డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

సీతానగరం: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఉన్నతాధికారుల సూచనల మేరకు వాహనాల తనిఖీ ముమ్మరం చేశామని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి 2 గంటల వరకూ రాష్ట్ర రహదారిపై ప్రయాణం చేస్తున్న వాహనాలను, వాహన చోదకులను ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ రాత్రిపూట వాహనాలు తనిఖీ చేయాలన్న ఆదేశాల మేరకు రాష్ట్ర రహదారి విస్తరించిన సూరంపేట నుంచి లచ్చయ్యపేట స్పన్‌పైప్‌ల ఫ్యాక్టరీ వరకూ వాహనాలు తనిఖీ చేసినట్లు చెప్పారు. అలాగే రహదారిలో రాత్రింబవళ్లు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేసే సమయంలో వాహనాలు నిలిపి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పెట్రోలింగ్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం పట్టణంలో తనిఖీ నిర్వహిస్తున్న ఏఎస్పీ సనీల్ సురేన్

పార్వతీపురంలో వాహన తనిఖీలు

పార్వతీపురంటౌన్: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి పార్వతీపురం పట్టణంలోని పాత బస్టాండ్ జంక్షన్ వద్ద పలువాహనాలను పార్వతీపురం ఏఎస్పీ సనీల్ సురేన్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనాలు, కార్లలో అధిక మొత్తంలో నగదు తరలించడం, మద్యం, గంజాయి, మదక ద్రవ్యాలను తరలించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. వాహన చోదకులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ తనిఖీల్లో పట్టణ సీఐ కృష్ణారావు, ఎస్సై సంతోషి, సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: కారు డిక్కీలను తనిఖీ చేస్తున్న ఎస్సై ఎం.రాజేష్, సిబ్బంది

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడదాం

బలిజిపేట: హిందూ ధర్మ పరిరక్షణకు అందరం పాటుపడాలని మండల ఉపాధ్యక్షుడు సాయిరాం పిలుపునిచ్చారు. బలిజిపేట మండలంలోని మిర్తివలసలో బొబ్బిలి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో మెడిటేషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో గ్రామాల్లో మెడిటేషన్ కేంద్రాలను ప్రారంభించి అందరినీ హిందూ ధర్మ పరిరక్షణకు కార్యోనుఖులను చేయాలని కోరారు. అందరికీ ఉపయోగకరమైన వాటిని ఏర్పాటుచేసి ప్రజలలో మంచి భావాలు కలిగే విధంగా కృషిచేస్తున్న బ్రహ్మకుమారీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి రాజేశ్వరి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, గ్రామపెద్దలు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.



మిర్తివలసలో బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని ప్రారంభించిన మండల ఉపాధ్యక్షుడు సాయిరాం

పంటపొలాల రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

సీతానగరం: మండలంలో అధ్వానంగా ఉన్న పంటపొలాల రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు జెడ్పీటీసీ ఎం.బాబ్జి, ఇంజినీరింగ్ సహాయకుడు అశోక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు లచ్చయ్య పేటలో శివాలయం నుంచి మూలబంద పొలాలకు వేస్తున్న రహదారి పనులను, గుమ్మిడివరం గ్రామానికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ సహాయకుడు అశోక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు గ్రామంలో ఈటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ పర్యటించిన సమయంలో పొలాల్లో తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకు చేర్చడానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రహదారి అభివృద్ధి చేయాలని రైతుల కోరినట్లు చెప్పారు. ఈ మేరకు జెడ్పీనిధులు రూ.10 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టునట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



గ్రావెల్ కుప్పలను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ సహాయకుడు అశోక్

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

పార్వతీపురంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడిచిన 56 నెలల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నర్సిపురం పంచాయతీ, విశ్వంబరపురం గ్రామానికి చెందిన 30 మంది టీడీపీ కార్యకర్తలు, వారి కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరాయి. ఈ మేరకు తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ అందనం కష్టపడి పనిచేసి మళ్లీ జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుని ఈ ప్రజాప్రభుత్వాన్ని కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో దొమ్మరి పోలీసు, పి.సూరిబాబు, పక్కి అశోక్, పక్కి కామేశ్వరరావు, బలరాం, దొమ్మరి సింహాచలం, అనిల్, గిరిలతో పాటు వారి 30 కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ వెంపలి గురురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులందరూ హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే...గిరిజన గ్రామాలకు రోడ్లు

- టీడీపీ నాయకులు చేసింది శూన్యం
- మంత్రి పీడిక రాజన్నదొర
- దిగువ కాసాయవలన గ్రామానికి రూ. 152 లక్షలతో బీటీ రోడ్డు

సాలూరు రూరల్ :

వైఎస్సార్‌సీపీ హయాంలోనే గిరిజన గ్రామాలకు రోడ్లు వేశామని.. 2014 నుంచి 19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు చేసింది శూన్యమని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. కురుకూటి పంచాయతీ దిగువ కాసాయవలసకు రూ.152 లక్షలతో వేయనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం గిరిజనులతో మమేకం కావడం వల్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించగలిగానని చెప్పారు. ఎటువంటి అభివృద్ధి చేపటని టీడీపీ నాయకులు ప్రజల మధ్య ఎలా తిరగగలుగుతున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. దిగువ కాసాయవలసకు అడిగిన వెంటనే రోడ్డు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి గిరిజనులందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు పాలించినా, వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమాన్ని ఇవ్వలేకపోయాయని తెలిపారు. అనంతరం పులివలసకు 27 లక్షల రూపాయలతో కాజ్‌వే నిర్మాణానికి.. అలాగే మావుడి కొత్తవలసకు రూ.145 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి.. ఇటికివలస గ్రామానికి 75 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రాజన్నదొరను గెలిపించుకునే బాధ్యత మనందరిది..

రాజన్నదొరను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీను అన్నారు. రాజన్నదొర మంత్రిగా ఉండబట్టే ఏజెన్సీ ఏరియా అభివృద్ధి చెందిందని చెప్పారు. మరోసారి రాజన్నదొర గెలిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండ ల ఉపాధ్యక్షుడు సువ్వాడ రామకృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమా రి, తోణాం సర్పంచ్ మువ్వల ఆదయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, పాల్గొన్నారు.



దిగువకాసాయివలస రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

శివరాత్రికి సిద్ధమవుతున్న శైవ క్షేత్రాలు

- పారమ్మకొండ, గోకర్ణేశ్వరస్వామి, తదితర శైవక్షేత్రాల్లో ప్రారంభమైన జాతర ఏర్పాట్లు

పాచిపెంట: శైవ క్షేత్రాలు శివరాత్రికు సిద్ధమవుతున్నాయి. మండల పరిధి చీపురువలస సమీపంలోని పారమ్మకొండ, మంచాడవలసలోని గోకర్ణేశ్వరస్వామి, పాచిపెంట మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి, కర్రివలస శివాలయం తదితర శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. పారమ్మ కొండకు 2400 సంవత్సరాల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. కొండపై 36 చేతులతో ఆయుధాలు ధరించి శిరస్సుపై శివుడిని కలిగి ఉన్న అమ్మవారిని (పారమ్మ తల్లి) దేవతులు ప్రతిష్ఠించారని భక్తుల నమ్మకం. వనవాసం సమయంలో పాండవులు ఇక్కడి గుహలోనే ఉండేవారని ప్రతీతి. పారమ్మ తల్లికి మొదటగా పూజలు చేసింది స్థానిక గిరిజనులే. అమ్మవారి మూర్తిలోని నంది కూడా ఉండడంతో గిరిజనులు ఈ విగ్రహాన్ని శివపార్వతులుగా భావించి పూజలు చేస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లి కావడంతో పారమ్మతల్లి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. కొండపైకి ఎక్కలేని భక్తులు కోసం కొండ కింద అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు.



మంచాడవలస గుహలో ఉన్న శివలింగం, నంది, వినాయక విగ్రహాలు

ప్రత్యేకతలు..

అమ్మవారి కొండకు వెళ్లే మార్గంలో మొదటగా గణపతి దర్శనమిస్తారు. తర్వాత పరమశివుడు శ్రీ భువనేశ్వరి సమేతంగా కనిపిస్తారు. ఇంకా ముందుకు వెళితే లలితాదేవి 13 అడుగుల శ్రీచక్ర రూపంలో దర్శనమిస్తారు. 2008లో కొండపై శ్రీచక్రాన్ని ఏర్పా టు చేశారు. ఈ కొండ నాగశక్తికి ప్రతీతి. ఇక్కడ ప్రత్యేక నాగ మందిరాలు ఉన్నాయి. 2006లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈ కొండపై నిర్మించారు.

ప్రత్యేక ఆకర్షణలు

36 చేతులతో దర్శనమిచ్చే అమ్మవారి మూర్తి. ప్రత్యేక రోజుల్లో కొండపై వెలిగించే అఖండజ్యోతి, పాండవుల గుహ, ఏడాది పొడవునా కొండ మధ్యలోనుంచి వచ్చే నీరు (ఆకాశ గంగ), తదితర అనేక ప్రత్యేకతలు ఈ కొండకు అలంకరణలు.

గుహలో గోకర్ణేశ్వరుడు..

మండలంలోని మంచాడవలస గ్రామ సమీపంలో వెలసిన గోకర్ణేశ్వర స్వామి గుహలో వెలిశాడు. కొండపై ఉన్న ఈ గుహలోకి వెళ్లేముందు 18 అడుగుల నంది విగ్రహం దర్శనమిస్తుంది. అక్కడే 28 అడుగులు ఉన్న శివుని విగ్రహం ఉంటుంది. పెద్ద ఆంజనేయుడు చేతిలో శివలింగంతో దర్శనమిస్తాడు. గుహ ప్రవేశమార్గం పెద్ద ఏనుగు తల ఆకారంలో ఉంటుంది. సాలూరు, పాచిపెంటలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు అధికంగా ఈ ఆలయానికి వస్తుంటారు. మహాశివరాత్రి రోజున పెద్ద జాతర జరుగుతుంది.